
సాక్షి మంచిర్యాల

గురువారం । 16 । నవంబర్ । 2023



పరోక్షంగా బరిలో.. 10లో▸

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఎన్నికల బరిలో నిలిచేందుకు మహిళలు ప్రయత్నించినా అవకాశం దక్కలేదు. అయినప్పటికీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్నారు.



సమస్యలు తీరేనా..

మంచిర్యాల నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనలో వెనుకబడుతూనే ఉంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం 32.0 /20.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

బరిలో 44 మంది

- మంచిర్యాలలో అత్యధికం
- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- స్వతంత్రులకు గుర్తుల కేటాయింపు

మంచిర్యాలఅగ్రికల్చర్: అసెంబ్లీ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల ఉపసంహరణల పర్వం ముగిసింది. ఎన్నికల సమరంలో తలపడే అభ్యర్థుల లెక్క తేలింది. జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి(ఎస్సీ), చెన్నూర్(ఎస్సీ) నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్రులు కలిపి 44 మంది బరిలో ఉన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో అత్యధికంగా 17మంది పోటీ పడుతున్నారు. ఈ నెల 3నుంచి నామినేషన్లు స్వీకరించగా మంచిర్యాల నియోజకవర్గంలో 25మంది 44 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. 13న పరిశీలన నిర్వహించగా.. సరైన ధ్రువీకరణ పత్రాలు, వివరాలు పొందుపర్చని ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించారు. మంగళ, బుధవారాల్లో ఐదుగురు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఉప సంహరించుకున్న వారిలో పోలంపల్లి మహేశ్, కొట్టె సంపత్‌కుమార్, గవ్వల శ్రీకాంత్, మహమ్మద్ కలీం ఉన్నారు. మంచిర్యాలలో ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్రులు మొత్తంగా 17 మంది బరిలో నిలిచారు. వీరిలో కొక్కిరాల ప్రేంసాగర్‌రావు(కాంగ్రెస్), రఘునాథ్‌రావు వెరబెల్లి(బీజేపీ), నడిపెల్లి దివాకర్‌రావు(బీఆర్ఎస్), తోట శ్రీనివాస్(బీఎస్పీ), అదునూరి రమేష్(ధర్మ సమాజ్ పార్టీ), చెరుకూరి శాంతిశ్రీ(బహుజన రిపబ్లికేషన్ సోషల్ పార్టీ), దొమ్మటి రవికుమార్ (ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ), స్వతంత్రులు ఎండీ.సహీం పాష, రంగు మల్లేష్, గొర్లపల్లి సురేష్, అందె మంగ, తలారీ వెంకటేశ్వర్లు, సొల్ల సందీప్, ఎండీ.ఇర్ఫాన్ హైమద్, మొగిళి కృష్ణ, ప్రణయ్ గంగరెడ్డి, హనుమాండ్ల శంకర్ ఉన్నారు.




మంచిర్యాలలో కలెక్టర్ బి.సంతోష్ పరిశీలన



చెన్నూర్‌లో నామినేషన్ ఉపసంహరణ



దివాకర్‌రావు



ప్రేమ్‌సాగర్‌రావు



రఘునాథ్‌రావు

జంగ్ తెలంగాణ

బెల్లంపల్లిలో..



బెల్లంపల్లి: బెల్లంపల్లి(ఎస్సీ) నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈసారి 25 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా వీరిలో 9 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగతా 16 మంది నామినేషన్లు సరిగా ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.రాహుల్ ప్రకటించారు. బుధవారం నామినేషన్ పత్రాల ఉపసంహరణ గడువు ముగిసింది. గంధం రమేష్, కొండగొర్ల వేదప్రకాష్, లింగంపెల్లి మధుకర్ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. మిగతా 13మంది బరిలో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. అభ్యర్థులు, ప్రతిపాదకులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి గుర్తులను కేటాయించారు. అభ్యర్థులకు కేటాయించిన గుర్తులు ఈ విధంగా ఉన్నాయి.



దుర్గం చిన్నయ్య



గడ్డం వినోద్



అమురాజుల శ్రీదేవి

అభ్యర్థి	రాజకీయ పార్టీ	కేటాయించిన గుర్తు
అమురాజుల శ్రీదేవి	బీజేపీ	కమలం
గడ్డం వినోద్	కాంగ్రెస్	చేయి
దుర్గం చిన్నయ్య	భారత్ రాష్ట్ర సమితి	కారు
జాడి నర్సయ్య	బహుజన్ సమాజ్ పార్టీ	ఏనుగు
గోగర్ల శంకర్	సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్	రంపం
జంగపల్లి రామస్వామి	ధర్మసమాజ్ పార్టీ	టార్చ్ లైట్
ఎడ్ల పద్మ	బహుజన్ ముక్తి పార్టీ	మంచం
పెరుగు రవీందర్	సోషలిస్టుపార్టీ(ఇండియా)	ఎయిర్ కండీషనర్
రామగిరి శ్రీపతి	భారత చైతన్యయువజన పార్టీ	చెరుకు రైతు
రామటెంకి శ్రీనివాస్	రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా	కంప్యూటర్
అంబాల మహేందర్	ఇండిపెండెంట్	ఉంగరం
దాగం శ్రీనివాస్	ఇండిపెండెంట్	టెలివిజన్(టీవీ)
దుర్గే ఈశ్వర్	ఇండిపెండెంట్	మైక్

చెన్నూర్‌లో..



చెన్నూర్: చెన్నూర్(ఎస్సీ) అసెంబ్లీ స్థానంలో 14 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 30 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా ఆరు తిరస్కరించారు. మంగళవారం నలుగురు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. బుధవారం ఆరుగురు నామినేషన్లను ఉపసంహరించుకోగా.. వీరిలో చకినారపు కిరణ్, జాడి యేసయ్య, ముయ్యి రాంబాబు, జుమిడి గోపాల్, బత్తుల సరిత, మేకల రాధిక ఉన్నారు. 14మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి సిడాం దత్తు తెలిపారు. బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు.



బాల్క సుమన్



గడ్డం వివేకానంద్



దుర్గం అశోక్

అభ్యర్థి	రాజకీయ పార్టీ	గుర్తు
గడ్డం వివేకానంద్	కాంగ్రెస్	హస్తం
దాసరపు శ్రీనివాస్	బీఎస్పీ	ఏనుగు
దుర్గం అశోక్	బీజేపీ	కమలం
బాల్క సుమన్	బీఆర్ఎస్	కారు
నడిపాటి రాజు	ధర్మసమాజ్ పార్టీ	టార్చ్‌లైట్
ముల్కల రాజేంద్రప్రసాద్	ఆల్ ఇండియా మహిళ ఎంపవర్‌మెంట్ పార్టీ	వజ్రము
మోతె రాజలింగు	సోషలిస్ట్ పార్టీ	అగ్గిపెట్టె
వడ్లకొండ రాజం	తెలంగాణ రాజ్యసమితి	గ్యాస్ సిలిండర్
మొయ్యి వేణుగోపాల్	బహుజన్ ముక్తి పార్టీ	మంచం
సల్లూరి మహేశ్	ప్రజారాజ్య సమితి	ఈల
సోగాల సంజీవ్	ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ	సింహం
అసంపల్లి సంపత్	స్వతంత్ర	గొలుసు
తుంగపిండి రమేశ్	స్వతంత్ర	పండ్ల బుట్ట
దుర్గం సమ్మయ్య	స్వతంత్ర	బకెట్

ఖానాపూర్ నియోజకవర్గంలో..

ఖానాపూర్ నియోజకవర్గం జన్నారం మండలం మంచిర్యాల జిల్లాలో ఉంది. 11మంది బరిలో ఉన్నారు. జాన్సన్ నాయక్ భుక్యా(బీఆర్ఎస్), వెడ్మ బొజ్జు(కాంగ్రెస్), రమేష్ రాథోడ్(బీజేపీ), జాదవ్ ప్రభాస్(ధర్మ సమాజ్), ఆత్రం రవీందర్(స్వతంత్ర), బన్సీలాల్ రాథోడ్ (బీఎస్పీ), ఆశారెడ్డి బొంత(గొండ్వానా గణతంత్ర పార్టీ), పెందూర్ ప్రియాంక(సీపీఐ రెడ్‌స్టార్), మోహన్(స్వతంత్ర), నేతావత్ రాజేందర్(స్వతంత్ర), కూతాటి విజయ(పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా) బరిలో ఉన్నారు.



భుక్యా జాన్సన్ నాయక్



వెడ్మ బొజ్జు పటేల్



రాథోడ్ రమేశ్

యువ ఓటర్లే నిర్ణేతలు..!

నియోజకవర్గాల వారీగా 18 నుంచి 30 ఏళ్లలోపు వారు

బెల్లంపల్లి	41,616
చెన్నూర్	44,945
మంచిర్యాల	64,139

బెల్లంపల్లి: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి యువ ఓటర్లు నిర్ణేతలుగా మారబోతున్నారు. అభ్యర్థులు గెలుపోటములపై ప్రభావం చూపించనున్నారు. కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువతీ యువకులతోపాటు యువజన ఓటర్లు అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్దేశించనున్నారు. జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. బెల్లంపల్లిలో 1,73,335 మంది ఓటర్లు, చెన్నూర్‌లో 1,88,283 మంది ఓటర్లు, మంచిర్యాలలో 2,74,807 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 18 నుంచి 30ఏళ్ల వయస్సు ఓటర్లు ఎటు వైపు మొగ్గు చూపుతారో ఆ అభ్యర్థి విజయం సునాయాసం కానుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లాలో తొలిసారిగా ఓటు హక్కు వచ్చిన యువతీ, యువకులు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఎటు వైపు మొగ్గు చూపిస్తారనేది సర్వత్రా ఆసక్తిని కలిగిస్తోంది.

ఆకట్టుకునే ప్రయత్నాలు

యువ ఓటర్లను ఆకట్టుకోవడానికి ఎన్నికల్లో పోటీ పడుతున్న అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల తంతులో తమవంతు భాగస్వామ్యం చేయడంతోపాటు యువకులతో మమేకం కావడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటికే ఓ ప్రధాన రాజకీయ పార్టీ యువకులతో సమ్మేళనాలు నిర్వహించడానికి క్షేత్రస్థాయిలో కసరత్తు ప్రారంభించగా, మరో రాజకీయ పార్టీ తాయిలాలు అప్పగించేందుకు సన్నద్ధమవుతోంది. యువకులకు క్రికెట్, వాలీబాల్ కిట్లు, జిమ్ మెటీరియల్ అందించడానికి పావులు కదుపుతున్నారు. ప్రధానంగా ఎన్నికల ప్రచారంలో యువత భాగస్వామ్యం అధిక సంఖ్యలో ఉండేలా వ్యవహరిస్తున్నారు. ఇందుకోసం సంబంధిత అభ్యర్థి రాజకీయ పార్టీ అనుబంధ, యువజన విభాగాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడానికి కసరత్తు చేస్తున్నారు.

ఆలోచించి ఓటు వేస్తాను..



శక్తివంతమైన ఓటును ఎలాంటి ప్రలోభాలకు అమ్ముకోవద్దు. ముఖ్యంగా యువత ఎలాంటి ఆకర్షణలకు లోను కాకుండా ఓటు హక్కును వినియోగించుకుంటే దేశం బాగు పడుతుంది. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పాలకులు విఫలం అవుతున్నారు. అధికారం లక్ష్యంగా పాలన సాగిస్తున్నారు. అలా కాకుండా యువకుల కోసం ఆలోచించే నాయకుడికి ఓటు వేసి సద్వినియోగం చేసుకుంటా.

– రంగ నవీన్‌కుమార్, కాసిపేట

ఉద్యోగావకాశాలు కల్పించాలి



ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా యువకుల సమస్యలపై శ్రద్ధ చూపడం లేదు. ఎన్నికల్లో హామీ ఇచ్చి గెలిచిన తర్వాత విస్మరించడం పరిపాటిగా మారింది. డిగ్రీ చేసిన తర్వాత ఉద్యోగావకాశాలు లేక అనేకమంది నిరుద్యోగులుగా అవతారం ఎత్తుతున్నారు. ఉద్యోగాల కల్పన కోసం నోటిఫికేషన్లు సరిగా రావడం లేదు. నోటిఫికేషన్లు వచ్చిన తర్వాత అవాంతరాలు వచ్చి ఉద్యోగాలు రాకుండా పోతున్నాయి.

– వంగ శ్రీమాన్‌గౌడ్, బెల్లంపల్లి


సరైన అభ్యర్థికి ఓటు వేస్తా



ఓటు హక్కు ఎంతో విలువైనది. అభ్యర్థి గెలుపు ఓటమిని ఎంతగానో ప్రభావితం చేస్తుంది. అంతటి ప్రాధాన్యత కలిగిన ఓటును ప్రలోభాలకు గురికాకుండా వినియోగించుకుంటాను. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల గుణగణాలను బేరీజు వేసుకుని సరైన అభ్యర్థికి ఓటు వేయాలని అనుకుంటున్నాను. ముఖ్యంగా యువకుల సమస్యలను తీర్చే గలిగే శక్తి ఉన్న అభ్యర్థిని ఎన్నుకోవడానికి ప్రాధాన్యత ఇస్తాను.

– కాటం మానస, బెల్లంపల్లి

విద్యావకాశాలు కల్పించే వారికే..



18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయస్సు కలిగిన యువకులకు ఎంతో భవిష్యత్ ఉంటుంది. బంగారు భవిష్యత్‌కు ఆ వయస్సే కీలకం కానుంది. ఆ యువకులు ఉన్నత చదువులు చదువుకోవడానికి అందుబాటులో డిగ్రీ, పీజీ ఇతర ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చే అభ్యర్థిని ఎన్నుకోవాలనేది నా కోరిక. చదువు విలువ తెలిసి మసలుకునే నాయకుడికి ఓటు వేసి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని ఆశిస్తున్నాను.

– వంగ సాయికుమార్, తాండూర్

న్యూస్‌రీల్

సభాస్థలిని పరిశీలించిన సీపీ



సభాస్థలం పరిశీలిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

జన్నారం: ఈ నెల 17న జన్నారం మండలానికి మంత్రి కేటీఆర్ వస్తున్నందున శాంతిభద్రతల దృష్ట్యా రామగుండం సీపీ రెమారాజేశ్వరి బుధవారం మండల కేంద్రంలోని సభాస్థలిని పరిశీలించారు. అనంతరం హెలిప్యాడ్‌ను కూడా సందర్శించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నందున ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. సభ నిర్వాహకులతో మాట్లాడారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, లక్సెట్టిపేట సీఐ కృష్ణ, ఎస్సై సతీశ్ పాల్గొన్నారు.

రైతులకు సౌకర్యాలు కల్పించాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శేషాద్రి

జన్నారం: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని, ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఆర్‌డీవో శేషాద్రి అన్నారు. బుధవారం మండలంలోని కిష్టాపూర్, దేవునిగూడ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆలస్యం చేయకుండా ధాన్యం తూకం వేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ఐకేపీ సిబ్బందికి సూచించారు. తేమ శాతంపై రైతులకు వివరించాలని తెలిపారు. సివిల్ సప్లయ్ డీఎం గోపాల్, ఐకేపీ డీపీఎం వేణుగోపాల్, ఏపీఎం బుచ్చన్న, సీసీలు సదాచారి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నగదు జమ

మంచిర్యాలఅగ్రికల్చర్: రైతులకు పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ 15 విడత నగదును బుధవారం ఖాతాల్లో జమ చేసింది. వానాకాలం, యాసంగి పంటల సాగుకు గాను మూడు విడతల్లో రూ.2 వేల చొప్పున ఏడాదికి రూ.6 వేల నగదును రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈకేవైసీ పూర్తి చేసిన 69,746 మందికి నగదు జమ అయ్యాయి. రైతుల మొబైల్‌కు మెసేజ్ వస్తున్నాయి. వివరాల కోసం pmkisan.gov.in ద్వారా తెలుసుకోవచ్చని వ్యవసాయ అధికారులు తెలిపారు.

విదేశీ కరెన్సీ ప్రదర్శన



కరెన్సీ ప్రదర్శనను చూస్తున్న విద్యార్థులు

కోటపల్లి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 31 దేశాల విదేశీ కరెన్సీ ప్రదర్శన నిర్వహించారు. చెన్నూర్ మండలం అస్నాద్ జిల్లా పరిషత్ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు అనిల్‌కుమార్‌కు విదేశీ కరెన్సీ సేకరణపై ఆసక్తి ఉండగా 31 దేశాల కరెన్సీ సేకరించారు. పాఠశాల ఆవరణలో కరెన్సీని ప్రదర్శించి వాటి పేర్లు, విలువలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లావణ్య, వార్డెన్ సుమలత పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించాలి



మాట్లాడుతున్న ఏసీపీ సదయ్య

తాండూర్: సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సజావుగా ఎన్నికలు సాగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య అన్నారు. బుధవారం మండలంలోని మాదారం పోలీస్‌స్టేషన్ నుంచి మండల కేంద్రం వరకు కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగే ఎలాంటి చర్యలనైనా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. తాండూర్ సీఐ శ్రీనివాస రావు, ఎస్సైలు రాజశేఖర్, నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇక ప్రచార జోరు

- తేలిన తుది పోటీదారులు
- ప్రచారానికి పక్షం రోజులే గడువు
- వేగం పెంచిన ఎమ్మెల్యే అభ్యర్థులు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మరింత జోరందుకోనుంది. నామినేషన్ల ఉపసంహరణ ముగిసి బరిలో నిలిచే అభ్యర్థులు ఎవరనేది ఖరారు కావడంతో ఇక ప్రచారంపై దృష్టి సారిస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారంలో దూసుకెళ్తుండగా.. స్వతంత్రులూ ఓటర్ల వద్దకు వెళ్తున్నారు. ఈ నెల 30న పోలింగ్‌కు జరగనున్న నేపథ్యంలో మరో 15రోజులే మిగిలి ఉంది. ఎన్నికల నిబంధనల ప్రకారం 48గంటలు అంటే రెండు రోజుల ముందే అధికారికంగా ప్రచారం నిలిపివేయాల్సి వస్తుంది. ఓటర్లు కాని నియోజకవర్గంలో అభ్యర్థుల తరఫున ప్రచారం చేసిన రాజకీయ నాయకులు కూడా తమ ప్రాంతాలకు వెళ్లిపోవాల్సి ఉంది. ఈ క్రమంలో మిగిలిన 13రోజులే ఎన్నికల ప్రచారానికి కీలకంగా మారాయి. దీంతో అభ్యర్థులు మరింత వేగంగా ప్రచారానికి పదును పెడుతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ మందిని కలిసేలా ప్రణాళిక రచిస్తున్నారు. ర్యాలీలు, రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు, సభలు, సమావేశాల జోరు పెంచుతున్నారు. ప్రచార రథాలు, డిజిటల్ తెరలు గ్రామాలు, పట్టణాల్లో హోరెత్తుతున్నాయి. అభ్యర్థులు, తన అనుచరులు, కార్యకర్తలు, నాయకులతో కుటుంబ సభ్యులు సైతం ఓటర్ల వద్దకు వెళ్లి పలుకరిస్తున్నారు. ప్రధాన పార్టీ అభ్యర్థుల ప్రచారం ఇప్పటికే హోరాహోరీగా సాగుతోంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ నాయకులు ఇప్పటికే ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఇక స్వతంత్రులకు గుర్తులు కేటాయించడంతో వారు సైతం ప్రచార వేగం పెంచనున్నారు. గ్రామాలు, పట్టణాల్లోని వాడలు, కాలనీల్లో హోరాహోరీగా ప్రచారం సాగిస్తున్నారు.

ప్రతీ ఓటరుకు పలుకరింపు

ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతీ ఓటరును పలుకరించి తమకే ఓటేయ్యాలని కోరుతున్నారు. గుర్తు, తమ పార్టీ మేనిఫెస్టోను వివరిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుస్తున్నారు. యువ, మధ్యస్త, మహిళా, వృద్ధులు ఇలా అన్ని రకాల ఓటర్లను కలిసేలా ప్రణాళిక వేసుకున్నారు. అభ్యర్థితోపాటు స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు సైతం రోజువారీగా ఎక్కడికక్కడ ప్రచారం చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రచారం సాగిస్తున్నారు. ఎప్పటికప్పుడు వాట్సాప్ గ్రూపుల్లో తమ ప్రచార ఫొటోలు పోస్టు చేస్తూ పార్టీ నాయకులకు తెలియజేస్తున్నారు. ప్రత్యర్థులు చేస్తున్న ప్రచారంపై తిప్పికొడుతున్నారు. ఓ పార్టీ అభ్యర్థి వెళ్లిన వెంటనే ఆ ప్రాంతానికి మరో అభ్యర్థి వెళ్లి ప్రచారం చేస్తున్నారు.

వ్యూహాలకు పదును

తెల్లవారు జాము నుంచి రాత్రి పది దాటే వరకు అభ్యర్థులు ప్రచార కార్యక్రమాల్లోనే బిజీగా గడిపేస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రత్యర్థుల అడుగులకు అనుగుణంగా వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఉదయం నాలుగు గంటలకే మేల్కొని తమ కార్యక్రమాలు మొదలు పెడుతున్నారు. ప్రతిరోజూ అర్ధరాత్రి దాటే వరకు ప్రణాళికలు వేస్తున్నారు. సన్నిహితులతో మంతనాలు సాగిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ డబ్బుల ఖర్చు, వనరుల సమీకరణపై దృష్టి పెడుతున్నారు. ఓటు బ్యాంకు ఉన్న ప్రాంతాలు, కుల సంఘాలు, ప్రభావిత వర్గాలతో ఇంటికి పిలిపించుకుని ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. గెలిపిస్తే ఆయా వర్గాలు కోరినవన్నీ తీర్చుతామని హామీలు ఇస్తున్నారు. పొద్దంతా ప్రచారంలో రాత్రి వేళ వ్యూహాలు రచిస్తున్నారు.

ఎన్నికల స్ట్రాంగ్ రూమ్ తనిఖీ



బిశ్వజిత్ దత్తాకు వివరాలు వెల్లడిస్తున్న ఆర్వో

బెల్లంపల్లి: బెల్లంపల్లి బజారు ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు బిశ్వజిత్ దత్తా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బెల్లంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌తో కలిసి స్ట్రాంగ్ రూమ్, పరిసరాలను నిశితంగా పరిశీలించారు. తాళం, సీజ్ చేసిన తీరు పరిశీలించి బందోబస్తు చర్యలపై ఎన్నికల రిటర్నింగ్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు ముగిసే వరకు స్ట్రాంగ్ రూమ్ వద్ద రోజువారీగా బందోబస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్, తహసీల్దార్ సుధాకర్, డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తాండూర్: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను బెల్లంపల్లి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బిశ్వజిత్ దత్తా బుధవారం పరిశీలించారు. బెల్లంపల్లి ఏసీపీ సదయ్యతో కలిసి రేపల్లెవాడలో జాతీయ రహదారిపై అంతర్ జిల్లా చెక్ పోస్ట్‌ను తనిఖీ చేశారు. మాదారంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి స్థితిగతులను తెలుసుకున్నారు. తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్



బ్యాలెట్ నమూనా చూపిస్తున్న సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల్లో పోలింగ్ రోజున ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. బుధవారం ఐబీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన 'నేను నవంబర్ 30న ఓటు వేస్తాను' కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి బి.శేషాద్రి, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి సంతోష్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతో దేశ స్థితిగతులను మార్చవచ్చని, సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా దేశాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం నమూనా ద్వారా ఓటు వేసే విధానం వివరించారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలి

చెన్నూర్: సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్ అన్నారు. చెన్నూర్ ఆర్వో కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయం రికార్డులు, రిజిష్టర్లు, ఎన్నికల సామగ్రి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో పారదర్శకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల ప్రక్రియ ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ఓటరు స్లిప్పుల పంపిణీపై కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో చెన్నూర్ ఎన్నికల అధికారి సిడాం దత్తు, చెన్నూర్, మందమర్రి తహసీల్దార్లు మల్లికార్జున్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతులకు చేరువగా కొనుగోలు కేంద్రాలు

- వరి మద్దతు ధర సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రైతులు ఆరుగాలం కష్టించి పండించిన వరిపంటకు మద్దతు ధర అందిస్తుండగా రైతుల చేరువలోకి తీసుకువస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం హాజీపూర్ మండలం గడిపేటలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ధాన్యాన్ని పరిశీలించి వరి మద్దతు ధర ప్రచార పోస్టర్లు విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గోనె సంచులను రైతుల కల్లాలు, అనుమతిలేని ప్రదేశాలకు ఇవ్వకూడదని, తేమ శాతం 17 కంటే తక్కువ ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుకు రశీదు అందించాలని, వరి ఏ గ్రేడ్‌కు రూ.2,203, కామన్ గ్రేడ్‌కు రూ.2,183 మద్దతు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో తాగునీరు, నీడ కోసం టెంట్, టార్పాలిన్‌లు, క్లీనర్లు, ఇతర వసతులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, డీఆర్‌డీఓ బి.శేషాద్రి, పౌరసరఫరాల శాఖా జిల్లా మేనేజర్ గోపాల్, మండల వ్యవసాయాధికారి మార్గం రజిత, కేంద్ర నిర్వాహకుడు వెంకటస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

మంచిర్యాలఅర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న మంచిర్యాల బ్యాడ్మింటన్ ఆకాడమిలో 14 ఏళ్ల బాలబాలికలకు షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పరిమిళ తెలిపారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 10 గంటలకు రిపోర్టు చేయాలని, సంబంధిత ధ్రువపత్రాలు వెంటతెచ్చుకోవాలని సూచించారు.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యంతో ఎక్సైజ్ సీఐ, ఎస్సై

జన్నారం(ఖానాపూర్): మండలంలోని తపాలపూర్‌లో బుధవారం దాడులు నిర్వహించి మద్యం పట్టుకున్నట్లు లక్సెట్టిపేట ఎక్సైజ్ సీఐ సాయిబాబ, ఎస్సై రాబర్ట్ తెలిపారు. గ్రామంలోని రాంటెంకి లక్ష్మీకి చెందిన కిరాణ దుకాణంలో ఐబీ 375 ఎంఎల్ బాటిళ్లు 5, 90 ఎంఎల్ బాటిళ్లు 96, ఓసీ 375 ఎంఎల్ బాటిళ్లు 9, 90 ఎంఎల్ బాటిళ్లు 30 లభించినట్లు తెలిపారు. బాటిళ్లను స్వాధీనం చేసుకుని మద్యం విక్రయిస్తున్న రాంటెంకి లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు టీడీపీ మద్దతు



ప్రేంసాగర్‌రావుకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): కాంగ్రెస్, టీడీపీలు ఎన్నికల్లో కలిసి నడవడం చర్చనీయాంశమైంది. మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు బుధవారం శ్రీరాంపూర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు తలారి రాజు, టీఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి కుంచె భూపతి, ప్రచార కార్యదర్శి పెద్దపల్లి శంకర్, స్థానిక నాయకులు గరిగంటి రాజయ్యలతో పాటు పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆయనకు పార్టీ తరఫున మద్దతు ప్రకటించారు. అనంతరం ఆర్కే 8 కాలనీ మైదానంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ మద్దతు చూసి రాజకీయంలో శత్రువులు, మిత్రులు ఉండరనే నానుడి నిజమే అనిపిస్తోంది.

నగదు పట్టివేత

దహెగాం(సిర్పూర్): మండలంలోని ఇట్యాల గ్రామ సమీపంలో బుధవారం జరిపిన వాహనాల తనిఖీల్లో ఇరువురి వద్ద నుంచి రూ.2,66,500 నగదు పట్టుబడినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఇట్యాలకు చెందిన పొన్న సాయికృష్ణ వద్ద రూ.2లక్షలు, కర్జి గ్రామానికి చెందిన పుల్లం మల్లేశ్ వద్ద రూ.66,500 నగదు లభ్యమైందన్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు, ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

నస్పూర్(మంచిర్యాల): పట్టణ పరిధిలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో నగదు పట్టుబడినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన కుసుమల్ల స్వామినాథన్ బైక్‌పై రూ.7 లక్షల నగదును తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్‌చేసి ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

పరోక్షంగా బరిలో..

- ఎన్నికల్లో తప్పనిసరి నిలుస్తారని అనుకున్న మహిళా నేతలు
- అనివార్య కారణాలతో ఒకరు.. పార్టీ నిరాదరణకు గురై కొందరు
- టికెట్ రాకపోవడంతో కండువా మార్చి..
- ఆయా అభ్యర్థుల గెలుపును సవాలుగా తీసుకుని కురుక్షేత్రంలో..
- ఆ నారీ నేతల రాజకీయంపై అందరి దృష్టి

జంగ్ తెలంగాణ



సాక్షి, ఆదిలాబాద్: ఆ మహిళా నేతలు ఆషామాషీగా రాజకీయాల్లో ఉన్నవారు కాదు.. సీరియస్‌గా పొలిటికల్‌లో కొనసాగుతున్న వారే. ఈ ఎన్నికల్లో ఆయా పార్టీల నుంచి నియోజకవర్గాల్లో వాళ్ల పేరు బలంగా వినిపించిందే. అనివార్య కారణాలతో ఒకరు పోటీలో నిలవకపోగా, పార్టీ నిరాదరణకు గురై మిగితావారు ఈ ఎన్నికల్లో ప్రత్యక్ష పోరుకు దూరమయ్యారు. ఆ ఒక్కరు మినహా అందరు పార్టీ, కండువా మార్చి తామనుకున్న చోట అభ్యర్థిత్వం దక్కించుకున్న వ్యక్తికి వ్యతిరేకంగా ప్రత్యర్థి పార్టీలో చేరారు. ఇప్పుడు తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. టికెట్ దక్కలేదని వెనుకడుగు వేయకుండా ఈ ఎన్నికల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ విజయం సాధించాలని తలుస్తున్నారు. అభ్యర్థిగా కాకపోయినా పరోక్షంగా బరిలో నిలిచినట్లు భావిస్తూ సవాలుగా ముందుకు కదులుతున్నారు.

ఆసిఫాబాద్‌లో మర్సుకోల సరస్వతి



ఆసిఫాబాద్ కాంగ్రెస్‌లో మర్సుకోల సరస్వతి ముందు నుంచీ టికెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పీసీసీ సభ్యురాలిగా కొనసాగిన ఆమె ఈ ఎన్నికల్లో పార్టీ టికెట్ దక్కించుకుని బరిలో నిలుస్తానని ఎంతో ఆశగా ముందుకు కదిలారు. పార్టీ శ్యామ్‌నాయక్‌కు టికెట్ కేటాయించడంతో ఆమె కాంగ్రెస్‌ను వీడారు. తన సోదరి, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోవ లక్ష్మికి మద్దతుగా నిలిచారు. ఇటీవలే కేటీఆర్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకొని ప్రస్తుతం అభ్యర్థితో కలిసి నియోజకవర్గంలో జోరుగా ప్రచారం చేస్తున్నారు.

ఆదిలాబాద్‌లో గండ్రత్ సుజాత



ఆదిలాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నుంచి టిక్కెట్‌ను ఆశించిన గండ్రత్ సుజాత నిరాదరణకు గురయ్యారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ టిక్కెట్ కంది శ్రీనివాసరెడ్డికి దక్కడంతో అసమ్మతి నేతలు సాజిద్‌ఖాన్, సంజీవ్‌రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి ఆమె పార్టీకి రాజీనామా చేసి బయటకు వచ్చారు. సంజీవ్‌రెడ్డిని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిపిన అసమ్మతి వర్గం అతని గెలుపు కోసం విస్తృతంగా యత్నిస్తున్నారు. గతంలో రెండుసార్లు ఎమ్మెల్యే బరిలో నిలిచిన సుజాతకు పరాజయం ఎదురైంది. ఈ ఎన్నికల్లో టిక్కెట్ రాలేదని వెనుకడుగు వేయకుండా స్వతంత్ర అభ్యర్థిని రంగంలోకి దించి విజయం కోసం ముందుకు సాగుతున్నారు.

ముధోల్‌లో పడకంటి రమాదేవి



నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షురాలిగా వ్యవహరించిన పడకంటి రమాదేవి ముధోల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని మరోసారి ఆపార్టీ టికెట్‌ను ఆశించారు. గతంలో ఆమె రెండుసార్లు పోటీ చేసినప్పటికీ జయం వరించలేదు. ఈసారి రామారావుపటేల్‌కు బీజేపీ టిక్కెట్ దక్కడంతో ఆమె పార్టీపై తిరుగుబావుటా ఎగురవేశారు. ఇటీవలే కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం చేపడుతున్నారు.

మంచిర్యాలలో సురేఖ



ఆమె మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు సురేఖ. ఆ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావు సతీమణి. జిల్లాలో కాంగ్రెస్ శ్రేణుల ఆదరాభిమానాలు పొందిన మహిళా నేత. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి ఇక్కడ బరిలో నిలుస్తారని అందరూ అనుకున్నారు. ప్రస్తుతం ఆయన గెలుపు కోసం ఆమె రోజూ ప్రచారంలో విస్తృతంగా పాల్గొంటున్నారు.

ఖానాపూర్‌లో రేఖానాయక్



రేఖానాయక్ రెండోమారు ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. మరోసారి బీఆర్ఎస్ పార్టీలో ఖానాపూర్ బరిలో నిలవాలని ఆశించారు. పార్టీ టికెట్ భుక్య జాన్సన్ నాయక్‌కు దక్కడంతో ఆమె తిరుగుబావుటా ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం చేపడుతున్నారు.

ఎన్నికల ప్రచారంలో ఎస్‌సీఆర్పీ!



ప్రచారంలో రవీందర్

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఎస్‌సీఆర్పీ(స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్)గా పని చేస్తున్న రాథోడ్ రవీందర్ కెరమెరి మండలం లక్మపూర్‌లో కాంగ్రెస్ పార్టీ తరుపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు వాట్సాప్, సోషల్ మీడియంలో వైరల్‌గా మారింది. దీనిపై ఇతర పార్టీల నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం కలెక్టర్ హేమంత్ బోర్కడే రవీందర్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు డీటీడీవో రమాదేవి తెలిపారు. 24 గంటల తరువాత వారి నుంచి వచ్చిన సమాచారంతో తగు నిర్ణయం తీసుకోనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన శ్రీనివాస్



కండువా కప్పి ఆహ్వానిస్తున్న కేటీఆర్

రామకృష్ణాపూర్(చెన్నూర్): బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అందుగుల శ్రీనివాస్ బీఆర్ఎస్‌లో చేరారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా మంత్రి కేటీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పూటకో పార్టీ మార్చిన వివేక్ వెంకటస్వామి వల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందని, అందుకే అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్న బీఆర్ఎస్‌లో చేరుతున్నామన్నారు. అతనితో పాటు బీజేపీ నాయకులు జాడి ఏసయ్య, సప్పిడి నరేష్, కోల శ్రీనివాస్, రజినీకాంత్, వెంకటాచారి, జనసేన నాయకులు సిద్ధు, తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు.

‘బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించండి’

- సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి సూర్యం



మాట్లాడుతున్న సూర్యం

పాతమంచిర్యాల: ఫాసిస్టు బీజేపీ, నియంతృత్వ బీఆర్ఎస్ పార్టీలను ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి కే.సూర్యం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో పార్టీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల లబ్ధికోసం లక్షల కోట్ల దేశ వనరులను అదాని, అంబానీలకు కట్టబెట్టారన్నారు. మతోన్మాద చర్యలకు పాల్పడుతున్న బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయకుండా స్వార్థ రాజకీయాలు చేస్తోందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నంది రామయ్య, జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్, జిల్లా కమిటీ సభ్యులు పురంశెట్టి బాపు, ఉప్పులేటి సురేష్, చింతపురి బాపురావు, టి.రమాదేవి, అశోక్, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీలపై తేనెటీగల దాడి



గాయాలు చూపుతున్న కూలీ

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని నందులపల్లి శివారులో బుధవారం ఉపాధి హామీ కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. గ్రామంలోని బోర్లకుంట చంద్రయ్య చేను వద్ద పనులు ప్రారంభించగా పక్కనే ఉన్న మామిడి తోటలో నుంచి ఒక్కసారిగా తేనెటీగలు వచ్చి కూలీలపై దాడి చేశాయి. అంతేకాకుండా పక్కనే పశువులు మేపుతున్న కాపరులపై సైతం దాడి చేశాయి. అప్రమత్తమైన కూలీలు గ్రామంలోకి పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. ఈ దాడిలో ఉపాధి కూలీలు దుర్గం శ్రీనివాస్, దుర్గం సురేష్, గోమాస బాపులకు తీవ్రంగా పశువుల కాపరులు ఏల్పుల రఘులయ్య, కాల్వ సత్తయ్య, కొమ్ము రాజన్నలకు స్వల్ప గాయాలయ్యాయి. రెండు రోజుల క్రితం నక్కబండ చేను వద్ద శైలేందర్‌సింగ్ అనే రైతుపై తేనెటీగలు దాడి చేసి గాయపర్చాయి. గాయాలపాలైన వారిని కార్యదర్శి పద్మనాభం, ఈజీఎస్ మేట్ గోమాస వినోద్‌లు నెన్నెల పీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించారు. చుట్టుపక్కల తేనెటీగల దాడులు జరుగుతుండడంతో కూలీలు, రైతులు, పశువుల కాపరులు భయాందోళన చెందుతున్నారు.

ఆకట్టుకున్న అకడమిక్ ఎక్సలెన్స్ కాంక్లేవ్



ప్రదర్శన తిలకిస్తున్న ఎంఈవో జాడి పోచయ్య

మందమర్రిరూరల్(చెన్నూర్): పట్టణంలోని కార్మెల్ హైస్కూల్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన అకడమిక్ ఎక్సలెన్స్ కాంక్లేవ్ ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా ఎంఈవో జాడి పోచయ్య, రెవరెండ్ ప్రిన్స్ ఆంటోనీ, ఫ్రాన్సిస్ హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి వివిధ పాఠశాలల విద్యార్థులు సుమారు 1500 మంది హాజరై వారు తయారుచేసిన ప్రయోగాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్మెల్ అకాడమీ డైరెక్టర్ జేవియర్ రెక్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘కాళేశ్వరం పేరుతో ప్రజాధనం వృథా’



మాట్లాడుతున్న దొంతుల లక్ష్మీనారాయణ

చెన్నూర్: కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో ప్రభుత్వం లక్ష కోట్లు ప్రజాధనాన్ని వృథా చేసిందని తెలంగాణ ఇంజనీర్స్ ఫోరం కన్వీనర్ దొంతుల లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రూ.30 వేల కోట్లతో ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్ట్ పూర్తయ్యేదని, రీడిజైన్ పేరుతో ముఖ్యమంత్రి కేసీఆర్ చీఫ్ ఇంజినీరుగా అవతారమెత్తి స్థలం మార్చి తమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చారని తెలిపారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతి, అక్రమాలు జరిగాయని, నాణ్యతా లోపంతో మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోయాయని ఆరోపించారు. ప్రజాధనం వృథా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ ఇంజినీర్ ఫోరం సభ్యులు రాజయ్య పాల్గొన్నారు.

‘ప్యాకేజీలకు అమ్ముడు పోయారనడం సరికాదు’

మంచిర్యాలఅర్బన్: ఎన్నికల్లో పోటీ చేయకుండా ఓ పార్టీ నాయకుడు బెదిరించడం వల్ల నామినేషన్ వేయలేదని, ప్యాకేజీకి అమ్ముడుపోయి నామినేషన్ వేయలేదనడం సరికాదని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు అన్నారు. బుధవారం ట్రస్మా నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎవరో బెదిరిస్తే బెదిరే వ్యక్తిని కాదని, ప్యాకేజీ కోసం ఆరాటపడే వ్యక్తి అంతకన్నా కాదని, ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు 12 మంది పోటీలో ఉంటే కొందరు బీసీ ఉద్యమాన్ని నీరుగార్చారని తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్, ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కస్తూరి పద్మచరణ్, జిల్లా సభ్యులు దుర్గాప్రసాద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తీరేనా?

- నియోజకవర్గంలో ఏళ్లుగా సమస్యలు
- హామీలుగానే మిగులుతున్న వైనం
- ఇబ్బందుల్లో ప్రజలు



లక్సెట్టిపేట్: శిథిలావస్థలో కళాశాల భవనం



మంచిర్యాలలో నిలిచిన వంద ఫీట్ల రోడ్డు పనులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గంలో దండేపల్లి, లక్సెట్టిపేట్, హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్ మండలాలు ఉన్నాయి. మంచిర్యాల జిల్లా కేంద్రం కావడంతో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పించడంలో వెనుకబడుతూనే ఉంది. తలాపునే గోదావరి ఉన్నా పట్టణ ప్రజలకు తాగునీరు ఇవ్వలేని పరిస్థితి. పైపులైన్ల మరమ్మతు పేరిట మూడు నాలుగు రోజుల వరకు తాగునీరు అందించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. టూటౌన్‌గా పిలిచే హమాలివాడ ప్రజలకు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కలగానే మారింది. లక్ష్మీ థియేటర్ నుంచి హైటెక్‌సిటీ కాలనీ మీదుగా గోపాల్‌వాడ వరకు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే గోపాల్‌వాడ, రాజీవ్‌నగర్, హమాలివాడ, తిలక్‌నగర్ ప్రజలు మంచిర్యాలకు వచ్చేందుకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. కానీ రైల్వే ఫ్లైఓవర్‌బ్రిడ్జి నిర్మాణ పనులకు మోక్షం కలగడం లేదు. మంచిర్యాల ఐబీ నుంచి బొక్కల గుట్ట వరకు నాలుగులైన్ల రహదారి నిర్మాణానికి రూ.35 కోట్ల నిధులు విడుదలైనా పనులు ప్రారంభించక పోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పట్టణంలో రోజుకు 50 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతుండగా ఆండాళమ్మ కాలనీలోని డంపింగ్‌యార్డులో పోయడంతో ఆ ప్రాంత ప్రజలు దుర్వాసన భరించలేకపోతున్నారు. మున్సిపల్ మాస్టర్ ప్లాన్ అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో 100 ఫీట్ల రింగురోడ్డు పనులు నిలిచిపోయాయి.

లక్సెట్టిపేట్ మండలంలో....

- స్థానిక గోదావరి నది వద్ద బోటింగ్ పాయింటును ఏర్పాటు చేస్తామన్న హామీ నెరవేరలేదు.
- చెల్లంపేట గ్రామ సమీపంలో గుండం వాగుపై ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి ఆయకట్టు కింద పొలాలకు నీరందించాల్సి ఉన్నా పనులు చేపట్టలేదు.
- మున్సిపాలిటీలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై పారుతోంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవనం శిథిలావస్థకు చేరుకుంది.

హాజీపూర్ మండలంలో...

మండలంలోని గఢ్‌పూర్ గ్రామ పంచాయతీతో పాటు మరో 7 గ్రామాలు మండల కేంద్రానికి 25 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలు మండల కార్యాలయాల్లో ఏ పని కావాలన్నా మంచిర్యాల మీదుగా హాజీపూర్‌కు వెళ్లాల్సి ఉంటుంది. బస్సు సౌకర్యం లేకపోవడంతో, ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

నస్పూర్ మండలంలో...

నస్పూర్ కాలనీలో వేలాది మంది పట్టభద్రులైన నిరుద్యోగులు ఉన్నారు. వారికి ఒక స్టడీ సెంటర్ (లైబ్రరీ) కావాలని కోరుతున్నారు. సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న కొందరికే పట్టాలు ఇచ్చారు. మిగతా వారికి ఇవ్వలేదు. మిషన్ భగీరథ నీరు చాలా ప్రాంతాలకు సరఫరా కావడంలేదు.

దండేపల్లి మండలంలో....

దండేపల్లిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ నిర్మాణానికి 2006లో రూ.33లక్షల నిధులు కేటాయించగా 80 శాతం వరకు భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఆ స్థలంపై కోర్టు కేసు వివాదం ఉండటంతో నిర్మాణ పనులు నిలిపివేశారు. 15 ఏళ్లుగా సమస్య పరిష్కారం కాక పోవడంతో ఇప్పటికీ అలాగే ఉంది. దీంతో జెడ్పీహెచ్ఎస్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్డులో కళాశాలను నిర్వహిస్తున్నారు.

- ధర్మరావ్‌పేట, ద్వారక, కొండాపూర్ గ్రామాల్లో 400 ఎకరాలకు సాగునీరందించాలనే లక్ష్యంతో 17 ఏళ్ల క్రితం ధర్మరావ్‌పేట వాగుపై రూ.30 లక్షలతో చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టారు. ముంపు బాధితులు కోర్టుకు వెళ్లడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.
- కడెం డిస్ట్రిబ్యూటరీ కింద రబీలో 1 నుండి 28 వరకు కాలువలు ద్వారా కడెం నీరు, 30 నుండి 42 వరకు కాలువల ద్వారా గూడెం ఎత్తిపోతల నీళ్లు అందిస్తుండగా మధ్యలో 22 నుండి 28 డిస్ట్రిబ్యూటరీ వరకు గల రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

బీఆర్ఎస్‌కు ఎల్‌హెచ్‌పీఎస్ మద్దతు



మాట్లాడుతున్న అజ్మీరా పూల్‌సింగ్

పాతమంచిర్యాల: లంబాడీల సమస్యలు పరిష్కరించిన బీఆర్ఎస్ పార్టీకి తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా పూల్‌సింగ్ నాయక్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లంబాడీలు 27 ఏళ్లుగా తమ హక్కులకోసం పోరాటాలు చేసినా కాంగ్రెస్, బీజేపీలు పట్టించుకోలేదన్నారు. జిల్లాలోని చెన్నూర్, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజక వర్గాలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు లంబాడాలు ఓట్లు వేసి మద్దతు చాటాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో తీరు.. విమర్శల పాలు

- ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల విధుల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది ఎలాంటి పొరపాట్లు చేయరాదని, నిర్లక్ష్యం వహించరాదని భారత ఎన్నికల సంఘం సూచిస్తోంది. కానీ మంచిర్యాల ఆర్వో తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ఆర్వో తీరుపై ఎన్నికల్లో నామినేషన్ వేసే అభ్యర్థులతో పాటు రిటర్నింగ్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గంలోని రిటర్నింగ్ అధికారులు ఏ రోజుకారోజు నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ వివరాలు సాయంత్రంలోగా ఎన్నికల వెబ్‌సైట్‌లో పొందుపర్చడంతో పాటు మీడియాకు తెలియపరుస్తున్నారు. కానీ మంచిర్యాలలో మాత్రం ఆర్వో ఫోన్ చేసినా స్పందించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. రోజువారి ఎన్నికల కార్యక్రమాలు మీడియాకు తెలియపర్చడంలేదని సంబంధిత అధికారులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయ సిబ్బందిని సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపిస్తున్నారు.

బావిలో దూకి ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చాకెటి భోజన్న(35) బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. చాకెటి భోజన్న బతుకుదెరువు కోసం ఐదేళ్ల క్రితం దుబాయ్ వెళ్లి నష్టపోయాడు. రెండేళ్ల క్రితం స్వగ్రామానికి చేరుకుని ఇంటిని నిర్మించుకున్నాడు. దీంతో అప్పులు పెరిగిపోయాయి. అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం సాయంత్రం పంట పొలానికి నీటిని పట్టించేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించాడు.